సర్వాంగ సుందరంగా పార్కులు

- నగర పార్కుల్లో ఆటవస్తువులు, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటు
- ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఏలూరు టౌన్: కరోనా వైరస్ వ్యాప్తి అనంతరం ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఏలూరు నగరవాసులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని సారధ్యంలో గత మూడేళ్లుగా నగరంలోని ఆయా నగరపాలక పార్కులను అభివృద్ధి చేస్తూ ప్రజలకు అందుబాటులోకి తెస్తోంది. మేయర్ షేక్ నూర్జహాన్ ఆధ్వర్యంలో పార్కుల అభివృద్ధిపై శ్రద్ధ పెట్టారు. నగర వాసులు సాయంత్రం, తెల్లవారుజామున జాగింగ్, వాకింగ్, యోగా, చిన్నపాటి వ్యాయామాలు చేసుకునేలా, సెలవుల్లో ఉల్లాసంగా గడిపేందుకు, ఆటలు ఆడుకునేందుకు పార్కులను తీర్చిదిద్దుతున్నారు.

ఆహ్లాదకరంగా పార్కులు

ఏలూరు మినీబైపాస్‌లోని నగరపాలక సంస్థ పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. ఈ పార్కుకు వచ్చేందుకు యువత ఆసక్తి చూపుతోంది. నిత్యం ఈ పార్కులో రెండు, మూడు పెండ్లి, ఇతర సరదా షూటింగులు చేస్తుండటం విశేషం. మంచి వాతావరణంలో చుట్టూ పచ్చటి చెట్లు, మొక్కలతోపాటు, పార్కులో పిల్లలు, మహిళలు చిన్నపాటి వ్యాయామాలు చేసేందుకు పరికరాలను ఏర్పాటు చేశారు. విశాలంగానూ ఉండడంతో పెద్ద సంఖ్యలోనే ప్రజలు ఈ పార్కుకు వస్తున్నారు.

మోతేవారితోటలోని..

నగరపాలక పార్కులో పచ్చటి మొక్కలు, పూల చెట్లు మనస్సుకు ప్రశాంతతను చేకూర్చుతున్నాయి. ఇక్కడ వాకింగ్ ట్రాక్, మహిళలకు వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. తెల్లవారుజామునే పెద్దసంఖ్యలో వాకర్లు, యోగా చేసేవారు వస్తున్నారు. పార్కు పరిరక్షణకు వాకర్స్ అసోసియేషన్ సైతం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది.

చాణక్యపురం కాలనీలో..

ఇక్కడున్న పార్కును ఇటీవల ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధులతో పార్కును అభివృద్ధి చేశారు. చుట్టూ కాంపౌండ్ వాల్‌తోపాటు, లోపల చిన్నారులకు ఉల్లాసాన్ని అందించేలా ఆటవస్తువులు, పార్కులో వాకింగ్ ట్రాక్, సేద దీరేందుకు బెంచీలు ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దారు.



మోతేవారితోటలో పచ్చటి మొక్కలతో సుందరంగా తీర్చిదిద్దిన పార్కు

పార్కుల అభివృద్ధి.. బాగుంది



పార్కులను అభివృద్ధి చేయటం ద్వారా ప్రజలకు మేలు కలుగుతుంది. సాయంత్రం వేళల్లో కాసేపు చల్లటి గాలికి సేదదీరేందుకు అవకాశం ఏర్పడుతుంది. పార్కులో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. పిల్లలు సరదాగా ఉల్లాసంగా గడిపేందుకు ఆటవస్తువులు ఉన్నాయి. ఆరోగ్యానికి శారీరక వ్యాయామం, మానసిక ఉల్లాసం ఎంతో ముఖ్యం.

– కె.సత్యవతి, ఏలూరు

ప్రజారోగ్యానికి మేలు



ప్రజల ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు పార్కులు దోహదపడతాయి. ఇప్పటికే చాణక్యపురి కాలనీలోని నగరపాలక పార్కును ఇడా నిధులతో ప్రత్యేకంగా అభివృద్ధి చేశాం. జూట్‌మిల్లు బ్రిడ్జి పైనా భారీ కుండీల్లో మొక్కలు నాటి పరిశుభ్రమైన గాలి అందేలా శ్రద్ధ వహిస్తున్నాం. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు, సేవలకు ఎమ్మెల్యే నాని సారథ్యంలో కృషి చేస్తాం.

– మధ్యాహ్నపు ఈశ్వరి, ఇడా చైర్‌పర్సన్, ఏలూరు



పోస్టల్ కాలనీలో ఆహ్లాదకరంగా మారిన నగరపాలక సంస్థ పార్కు



చాణక్యపురి కాలనీలోని ఇడా నిధులతో అభివృద్ధి చేసిన పార్కులో చిన్నారుల సందడి



ఏలూరు చాణక్యపురి కాలనీలో ఇడా నిధులతో అభివృద్ధి చేసిన పార్కు

క్లుప్తంగా

ఆకట్టుకున్న కోలాట నృత్యం



కోలాట బృందంతో గారపాటి చౌదరి

పెదవేగి : మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో శ్రీహరి శ్రీనివాస కోలాట భజన బృందం ఆధ్వర్యంలో గురువారం రాత్రి గజ్జపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా నేర్చుకున్న బృందం సభ్యులు నిర్వహించిన కోలాట నృత్యం ఆకట్టుకుంది. కోలాటం నేర్పిన గురువు సత్తార్‌ను తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి సత్కరించారు. తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్వరలో జిల్లా వ్యాప్తంగా ఉన్న కోలాట బృందాలతో భారీ ప్రదర్శన ఏలూరులో ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. మన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఆయన అన్నారు. జాస్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు జాస్తి లక్ష్మీనారాయణ, వల్లభనేని సురేంద్ర, సతీష్ పాల్గొన్నారు.

రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభం వద్ద పూజ చేస్తున్న ఎమ్మెల్యే

దెందులూరు: జోగన్నపాలెం రామాలయంలో గురువారం ఉదయం ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొని ధ్వజస్తంభం, యాగశాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. యాగశాల వద్ద పూజల్లో గ్రామ సర్పంచ్ పసుమర్తి రాజేశ్వరి ప్రభాకరరావు, సొసైటీ చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, సొసైటీ మాజీ చైర్మన్ డాక్టర్ పసుమర్తి మధు, శాంతకుమార్, నిట్టా గాంధీ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు.

సత్తా చాటిన గురుకుల విద్యార్థినులు

ద్వారకాతిరుమల: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు సత్తాచాటినట్టు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ బి.రాణి తెలిపారు. 90 మంది పరీక్షకు హాజరు కాగా, 76 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. అందులో 50 మంది ఫస్ట్ క్లాస్, 24 మంది సెకండ్ క్లాస్, ఇద్దరు థర్డ్ క్లాస్‌లో పాసైనట్టు చెప్పారు. బి.హర్షవర్ధిని 556, బి.వర్షిణి 542, వి.రమ్య 532, కేవీ జయశ్రీ 524 మార్కులు సాధించారన్నారు.

రైతులను, కూలీలను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): అకాల వర్షానికి దెబ్బతిన్న రైతాంగాన్ని, వ్యవసాయ కార్మికుల్ని ప్రభుత్వం ఆదుకోవలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం కోరారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏలూరు నగర కార్యాదర్శి పి.కిషోర్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో సీతారాం మాట్లాడారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల జిల్లాలో వరి పంట, మిర్చి, మామిడి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయన్నారు. రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధర కల్పించాలని సీతారాం కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని, జిల్లాలోని పట్టణాల్లో నిర్మాణాలు పూర్తయిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని, జగనన్న కాలనీలను రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి చేసి లబ్దిదారులకు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్, ఆర్ లింగరాజు, తెల్లం రామకృష్ణ, ఎం.నాగమణి, జి.రాజు, జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య, జి.నరసింహారావు, ఎం.జీవరత్నం, వై.నాగేంద్రరావు, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, పి.మంగరాజు, జి.వెంకట్రావు, ఎస్.నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కళారూపకాలపై శిక్షణ పొందాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ బళ్ల కనకదుర్గారావు

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారులు వివిధ కళారూపాలపై శిక్షణ పొందాలని ఏపీ ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా కన్వీనర్ బళ్ల కనకదుర్గారావు పిలుపునిచ్చారు. స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని స్ఫూర్తిభవన్‌లో పిట్టా వీరయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించిన ప్రజానాట్యమండలి జిల్లా ముఖ్యుల సమావేశంలో కనకదుర్గారావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ, మతోన్మాద విధానాల వల్ల జరిగే నష్టాలను ప్రజానీకానికి తెలియజేసే విధంగా తేలిక భాషలో కథలు రూపొందించి వాటిని ప్రజా సమూహాల్లో ప్రదర్శించేందుకు ప్రజానాట్యమండలి కళాకారులు సిద్ధం కావాలని సూచించారు. మే 21, 22 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి కళాకారులకు ఏలూరులో శిక్షణ ఇవ్వాలని సమావేశం నిర్ణయించిందన్నారు. ప్రజానాట్యమండలి ఏలూరు ఇన్‌చార్జి బండి వెంకటేశ్వరరావు, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఇటీవల ప్రజానాట్యమండలి కళారూపాలు తగ్గ ముఖ్యం పట్టాయన్నారు. తిరిగి జిల్లాలో ప్రజానాట్యమండలి నిర్మాణానికి పూర్తి సహకారం జిల్లా సీపీఐ అందిస్తుందని అతన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు భజంత్రీ శ్రీనివాసరావు, గేదెల నాగేశ్వరరావు, ఎంవీ చారి మాట్లాడారు. బాల కళాకారిణి ఉప్పులూరి లక్ష్మీ అరుణ పాడిన విప్లవ గీతాలు సమావేశాన్ని ఉత్సాహపరిచాయి.

శానిటేషన్ సిబ్బంది సేవలు అభినందనీయం

- మేయర్ షేక్ నూర్జహాన్
- హైజీన్ కిట్లు అందజేసిన రెడ్‌క్రాస్ సొసైటీ

ఏలూరు టౌన్: ఏలూరు నగర ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించేందుకు శానిటేషన్ సిబ్బంది చేస్తోన్న సేవలు అభినందనీయమని మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. ఏలూరు రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఏలూరు కార్పొరేషన్‌లో పనిచేస్తోన్న 500 మంది శానిటరీ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి హైజీన్ కిట్ల (ఒంటి సబ్బులు, బట్టల సబ్బులు, టూత్‌బ్రష్, పేస్ట్, షేవింగ్ కిట్, ఆయిల్, తదితర బ్రాండెడ్ కంపెనీ వస్తువులు సుమారుగా రూ.5 లక్షలు విలువ చేసే)ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ఏలూరు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచటంలో శానిటేషన్ సిబ్బంది కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. వీరి సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. వీరికి రెడ్‌క్రాస్ సంస్థ హైజీన్ కిట్లు అందజేయటం సంతోషంగా ఉందన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో రెడ్‌క్రాస్ బాధితులకు అండగా నిలుస్తుందన్నారు. వేసవిలో మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు, ప్రజలకు నీటి సరఫరాకు కార్పొరేషన్‌కు మంచినీటి ట్యాంకర్‌ను అందజేసిందని వివరించారు. డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు మాట్లాడుతూ తీవ్ర అనారోగ్యంతో బాధపడే తలసేమియా చిన్నారులకు రెడ్‌క్రాస్ విశేష సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. జిల్లా రెడ్‌క్రాస్ సేవలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు దక్కిందన్నారు.



శానిటేషన్ సిబ్బందికి హైజీన్ కిట్లను అందిస్తున్న మేయర్ నూర్జహాన్

మంచినీటి కూలర్ ఏర్పాటు

ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో మంచి నీటి కూలర్‌ను నగర మేయర్ షేక్ నూర్జహాన్ ప్రారంభించారు. నిత్యం ప్రజలు కార్పొరేషన్ కార్యాలయానికి వివిధ పనులపై వస్తూ ఉంటారని, ప్రజలకు వేసవిలో చల్లని నీటిని అందించేందుకు కూలర్ ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించటమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్లు జిజ్జువరపు విజయనిర్మల, అర్జి సత్యవతి, కలవకొల్లు సాంబ, గరికిముక్కు జయకర్, సబ్బన శ్రీనివాసరావు, యర్రంశెట్టి నాగబాబు, నాయకులు జనపరెడ్డి కృష్ణ, కొయ సత్తిబాబు, అద్దంకి హరిబాబు, అరేపల్లి సత్తిబాబు, దారపు తేజ, ఇనపనూరి జగదీష్, అర్జి నాగేశ్వరరావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, శానిటరీ సిబ్బంది ఉన్నారు.

వైద్య రంగం అభివృద్ధికి ప్రాధాన్యత

చింతలపూడి : రాష్ట్రంలో వైద్య రంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గురువారం రూ.కోటి 22 లక్షల వ్యయంతో మంజూరైన ల్యాబ్ పరికరాలను ఎమ్మెల్యే ఎలీజా ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతలపూడి ప్రజల చిరకాల వాంఛ అయిన 100 పడకల ఆసుపత్రి నిర్మాణం శరవేగంగా జరుగుతుందని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతి నియోజకవర్గానికి నూరు పడకల ఆసుపత్రి, ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను సీఎం జగన్ మోహన్‌రెడ్డి మంజూరు చేసినట్టు చెప్పారు. ఆసుపత్రిలో రోగులకు లభిస్తున్న వైద్య సౌకర్యాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డా ఎస్‌డీ రసూల్ ఎమ్మెల్యే ఎలీజాకు వివరించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	05-07
బెండకాయలు	24	కంద	70
పచ్చిమిర్చి	48	బీట్‌రూట్	34
కాకర కాయలు	40-44	కీరా దోస	32
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	96
బీరకాయలు (పందిరి)	32	అల్లం	220
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	32	పాలకూర	08-12
దొండకాయలు	24	చుక్కకూర	08-12
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	46	పుదీనా	05
దోసకాయలు	14	బఠాణి	--
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	31
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	16

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	13
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	10
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	22
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	05
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - బెంగళూరు	14.00	4021	--
ఏలూరు -తిరుపతి	16.00	4830	20



ఈదురుగాలుల ధాటికి కోడూరుపాడులో ఓ ఇంటిపై రేకులు ఎగిరిపోయిన దృశ్యం



పూళ్ల - ఎంఎంపురం రోడ్డులో ఓ కారుపై పడిన చెట్టు



పూళ్లలో ప్రధాన రోడ్డుపై పడిన విద్యుత్ వైర్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ షంషూద్దీన్



పూళ్ల - ఎంఎంపురం రహదారి వెంబడి పడిన చెట్లను తొలగిస్తున్న దృశ్యం

గాలి వాన బీభత్సం

భీమడోలు: మండలంలో గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా వీచిన ఈదురుగాలులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. వర్షం కూడా దంచికొట్టడంతో వారు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పులుచోట్ల కార్లపై చెట్లు విరిగిపడ్డాయి. ఈదురుగాలుల దెబ్బకు సుమారు రూ.70 లక్షల నష్టం వాటిల్లిందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ప్రధాన రహదారులపై భారీ చెట్లు నేలమట్టమయ్యాయి. వాహనదారులు రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కోడూరుపాడులోని ఇళ్లపైకప్పు రేకులు ఎగిరిపోయాయి. ఆక్వా చెర్వుల వద్ద విద్యుత్ పోల్స్ పాక్షికంగా దెబ్బతిన్నాయి. పూళ్ల నుంచి ఎంఎంపురం వరకు రహదారి వెంబడి ఉన్న వృక్షాలు పడి సుమారు 60 విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. దుద్దేపూడి ఏరియాలో 15 విద్యుత్ పోల్స్‌కు దెబ్బతిన్నాయి. పూళ్ల, కోడూరుపాడు, దుద్దేపూడి, కురెళ్లగూడెం గ్రామాల్లో తహసీల్దార్ షంషూద్దీన్ పర్యటించారు. యుద్ధప్రాతిపదికన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రైతుకు హామీ ఇచ్చారు. ప్రభావిత ప్రాంతాలకు మంచినీటి సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామారావుకు సూచించారు.

విధుల్లోకి నైట్ వాచ్‌మెన్లు.. పాఠశాలలకు రక్షణ

37 హైస్కూళ్లకు నియామకం

దెందులూరు: నాడు - నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించి, నూతన భవనాలను నిర్మించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తాజాగా పాఠశాలల భద్రత, అక్కడ పరికరాలు, పరికరాల పరిరక్షణ కోసం నైట్ వాచ్‌మెన్ల నియమించింది. దెందులూరు నియోజకవర్గంలోని దెందులూరు మండలంలో ఏడు, పెదవేగి మండలంలో 11, పెదపాడు మండలంలో 11, ఏలూరు రూరల్‌లో ఎనిమిది హైస్కూళ్లు ఉన్నాయి. ఈ 37 హైస్కూళ్లకు నైట్ వాచ్‌మెన్లను ప్రభుత్వం నియమించింది. వీరికి నెలకు రూ.6 వేలు గౌరవవేతనం కల్పించింది. ఈ నియామక ప్రక్రియను ప్రభుత్వ పాఠశాలల పేరెంట్ కమిటీలు, ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో మే 1వ తేదీన పూర్తి చేశారు. నైట్ వాచ్‌మెన్లు నిత్యం పాఠశాల మూసివేసే ముందు సాయంత్రం పాఠశాలకు హాజరుకావాలి. పనిదినాల్లో మరుసటి రోజు పాఠశాల తెరిచే వరకు విధుల్లో ఉండాలి. ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో పనిచేయాలి. పాఠశాల భవనం, ఇతర వస్తువులను రక్షించాలి. పాఠశాల ప్రాంగణంలోకి అనధికారిక వ్యక్తులు ప్రవేశించకుండా చూడాలి. సాయంత్రం పాఠశాలలో ఉన్న గార్డెన్‌లో మొక్కలు నీరుపోయాలి. ఆర్‌ఓ ప్లాంట్‌ను శుభ్రంగా ఉంచాలి. పాఠశాల మెటీరియల్ తీసుకురావడం, వాటిని హెచ్‌ఎంకు అందించడం చేయాలి. వాచ్‌మెన్ పనిని హెచ్‌ఎం, పేరెంట్ కమిటీ పర్యవేక్షిస్తారు.

1 నుంచే విధుల్లోకి వాచ్‌మెన్లు



జిల్లాలో పాఠశాలల్లో వాచ్‌మెన్ల నియామక ప్రక్రియ పూర్తి చేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు మే నెల 1వ తేదీ నుంచి వాచ్‌మెన్లు విధులు చేపట్టారు. ప్రభుత్వ స్కూళ్ల పరిరక్షణతో పాటు వాటిభద్రత, పర్యవేక్షణ తీసుకున్నారు.

– రవిసాగర్, జిల్లా విద్యాసాగర్, ఏలూరు జిల్లా

సంతోషంగా ఉంది



నైట్‌వాచ్‌మెన్ ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలను నా ఇంటిలాగే కాపాడటానికి కృషి చేస్తాను. ఈ అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌లకు నేను. నా కుటుంబం రుణపడి ఉంటాం.

– గండి ప్రకాశరావు, నైట్‌వాచ్‌మెన్, దెందులూరు పాఠశాల

క్రాంతి ప్రసాద్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

దెందులూరు: ఉపాధి హామీ పథకం దెందులూరు టెక్నికల్ అసిస్టెంట్ క్రాంతి ప్రసాద్ కుటుంబానికి త్వరితగతిన ప్రభుత్వ ఉద్యోగం మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. దెందులూరులో ఇటీవల మృతి చెందిన టెక్నికల్ క్రాంతి ప్రసాద్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గురువారం పరామర్శించారు. క్రాంతిప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి కుటుంబానికి జాబ్‌కార్డు మంజూరు, పని కల్పిన, మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు మధ్య వారధిగా మంచిపేరు తెచ్చుకున్న క్రాంతి ప్రసాద్ మృతి బాధాకరమన్నారు. వైఎస్సార్‌సీపీ క్రాంతి ప్రసాద్ కుటుంబానికి వెన్నుదన్నుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, నాయకులు పోకల రాంబాబు, తొత్తడి వేదకుమారి, కట్టా ఏసుబాబు, చల్లా మేరీరాజు, కొలుసు గణపతిరావు, రాము, కొంగర రత్నకుమార్ అబ్బాస్, అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, మేట్లు ఉన్నారు.